PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

పేదింటి ఆడపిల్ల పెళ్లికి పెద్దమనసుతో చేయూత


3లో

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి


3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 324 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- మంగళవారం 17 నవంబర్ 2026



అమెరికా ఆధిపత్యంపై
ఆసియాలో నిరసనలు

● ట్రంప్ పర్యటనకు ఫిలిప్పీన్స్‌లో వ్యతిరేకత ● పశ్చిమాసియా యుద్ధం ఆపాలని, అమెరికా జోక్యం నిలిపివేయాలని డిమాండ్

మనీలా,నవంబర్ 16(పి.సి.డబ్ల్యూ. న్యూస్): ఆసియా దేశాలపై ఆధిపత్యం కోసం అమెరికా అనుసరిస్తున్న రాజకీయ, ఆర్థిక వ్యూహాలకు వ్యతిరేకంగా ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో నిరసనలు వెల్లువెత్తాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పర్యటన నేపథ్యంలో వామపక్ష సంఘాలు, విద్యార్థులు, కార్మికులు ఆందోళనలు నిర్వహించారు. పశ్చిమాసియా యుద్ధాన్ని నిలిపివేయాలని, అమెరికా జోక్యాన్ని అడ్డుకోవాలని, అమెరికా మిగతా2లో...

ఆర్టీసీ పగ్గాలు చేపట్టిన
అనిల్ కుమార్

తెలంగాణ ఆర్టీసీ నూతన వైస్ చైర్మన్, ఎండీగా బాధ్యతల స్వీకరణ

వై. నాగిరెడ్డి స్థానంలో నియామకం..

బస్‌భవన్‌లో బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐపీఎస్ అధికారి


2లో



విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టుగా
సరఫరా ఉండాలి

రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలి

రైతులు, గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు నిరంతర విద్యుత్ అందించాలి

అధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశం

హైదరాబాద్,నవంబర్ 16(పి.సి.డబ్ల్యూ. న్యూస్): రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా ఉండేలా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విద్యుత్ డిమాండ్, సరఫరా మధ్య వ్యత్యాసం లేకుండా చూడాలని, రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. రానున్న రబీ సీజన్‌లో రైతులతో పాటు గృహ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు నిరంతరాయంగా విద్యుత్ అందించాలని స్పష్టం చేశారు.సోమవారం హైదరాబాద్‌లోని మిగతా2లో...

రామోజీ సేవలు చిరస్మరణీయం

రామోజీ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తాం: చంద్రబాబు

తొమ్మిది రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి ఎక్సలెన్స్ అవార్డులు ప్రదానం:కేంద్ర హోంమంత్రి అమిత్ షా



అమరావతి,నవంబర్ 16(పి.సి.డబ్ల్యూ. న్యూస్): రామోజీ సంస్థల వ్యవస్థాపకుడు రామోజీరావు సమాజానికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొనియాడారు. వ్యక్తులు తమ కృషి, పట్టుదలతో సంస్థలుగా, వ్యవస్థలుగా ఎదుగుతారని, అలాంటి అరుదైన వ్యక్తుల్లో రామోజీరావు ఒకరని పేర్కొన్నారు. రామోజీరావు 90వ జయంతిని పురస్కరించుకుని సోమవారం విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన రామోజీ ఎక్సలెన్స్ మిగతా2లో...

పోలీసు బ్యాండ్లతో దేశ సమైక్యతకు
సంగీత సవ్వడి

హైదరాబాద్‌లో 27వ అఖిల భారత పోలీసు బ్యాండ్ పోటీలు ప్రారంభం

25కు పైగా బృందాలు.. 1,500 మంది కళాకారుల ప్రతిభా ప్రదర్శన


2లో

కుటుంబంపై నిజాలు చెప్పేందుకే
ఆత్మకథ: సోనియా

'బిలాంగింగ్' పుస్తకాన్ని ఆవిష్కరించిన కాంగ్రెస్ అగ్రనేత

తల్లిదండ్రుల అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురైన రాహుల్



న్యూఢిల్లీ,నవంబర్ 16(పి.సి.డబ్ల్యూ. న్యూస్): తన కుటుంబంపై ఎన్నో ఏళ్లుగా తప్పుడు కథనాలు ప్రచారంలోకి వచ్చాయని, వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఆత్మకథ రాసినట్లు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ తెలిపారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో రచించిన పుస్తకాన్ని సోమవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీతో పాటు పలువురు ప్రతిపక్ష నేతలు పాల్గొన్నారు.తన అత్త ఇందిరాగాంధీ, భర్త రాజీవ్‌గాంధీ, పిల్లలు రాహుల్, ప్రియాంక గురించి వాస్తవాలకు దూరంగా అనేక కథనాలు ప్రచారమయ్యాయని సోనియా పేర్కొన్నారు. వాటికి తన అనుభవాల ద్వారా సమాధానం చెప్పాలనే ఉద్దేశంతో పుస్తకం రాసినట్లు వివరించారు. మొదట్లో రచనకు సంకోచించినప్పటికీ రాహుల్, ప్రియాంక ప్రోత్సాహంతో ముందుకు వచ్చినట్లు తెలిపారు.ఇటలీ నుంచి భారత్‌కు వచ్చి కొత్త కుటుంబం, సంస్కృతి, సంప్రదాయాలకు అలవాటు పడిన అనుభవాలను పుస్తకంలో వివరించినట్లు చెప్పారు. మిగతా2లో...


2లో

ఖేలో ఇండియా గేమ్స్‌కు
పటిష్ఠ ఏర్పాట్లు

డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో జాతీయ క్రీడా పోటీలు

ఆరు నగరాల్లో నిర్వహణ.. సుమారు 8 వేల మంది క్రీడాకారులు, ప్రతినిధుల రాక

హరీశ్‌రావు అవినీతిపై
విచారణ జరగాలి: కవిత

ప్రజాక్షేత్రంతో పాటు న్యాయపోరాటం చేస్తాం

త్వరలో భైరవ వాహనంతో రాష్ట్రవ్యాప్త యాత్ర


2లో

ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించేందుకు
అనుమతివ్వాలి

సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఇండియా కూటమి నేతలు

ఎన్నికల సంఘానికి 48 ప్రశ్నలు.. అఫిడవిట్‌లో సమాధానాలు లేవని అభ్యంతరం



2లో

విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాభవన్‌లో ఇంధన శాఖ అధికారులతో రాష్ట్ర విద్యుత్ సరఫరా పరిస్థితిపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, సరఫరా నిర్వహణ, అందుబాటులో ఉన్న వనరులు, మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు రానున్న రబీ సీజన్‌కు విద్యుత్ సంస్థలు చేపడుతున్న ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో విద్యుత్ అవసరాలు మరింత పెరిగే అవకాశమున్నందున అందుకు తగిన విధంగా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. **పెరిగిన విద్యుత్ డిమాండ్** రాష్ట్రంలో ఏటా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోందని భట్టి విక్రమార్క తెలిపారు. గత ఏడాది నవంబర్ 16న రాష్ట్రంలో గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 8,522 మెగావాట్లుగా ఉండగా, ఈ ఏడాది అదే తేదీన 12,802 మెగావాట్లకు చేరిందని పేర్కొన్నారు. అదేవిధంగా అక్టోబర్ 16న 20,018 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైనప్పటికీ విద్యుత్ సంస్థలు సమర్థవంతంగా సరఫరా చేయడం అభినందనీయమన్నారు. డిమాండ్ పెరిగినప్పటికీ వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా విద్యుత్ అందించడంలో అధికారులు చూపిన పనితీరును ప్రశంసించారు. **రబీ సీజన్‌పై ప్రత్యేక దృష్టి**రానున్న రబీ సీజన్‌లో దీర్ఘకాలిక పొడి వాతావరణం ఉండే అవకాశాలున్నాయని, దీంతో విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరిగే పరిస్థితులు ఏర్పడవచ్చని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ పరిస్థితులను ముందుగానే అంచనా వేసి అవసరమైన విద్యుత్‌ను సమకూర్చుకోవాలని ఆదేశించారు.

ముఖ్యంగా వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రైతులకు సాగు సమయంలో నిరంతర విద్యుత్ అందించడంతో పాటు గృహ, వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు కూడా సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. **జలవిద్యుత్ ఉత్పత్తిలో లోటు ఉన్నా సరఫరా**వర్షాభావ పరిస్థితుల కారణంగా జలవిద్యుత్ ఉత్పత్తిలో సుమారు 4,000 మెగావాట్ల కొరత ఏర్పడినప్పటికీ ఖరీఫ్ సీజన్‌లో రైతులతో పాటు అన్ని రంగాల వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరఫరా చేసినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి, సరఫరాలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించేందుకు సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అధికారులు ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఇందులో భాగంగా దావూద్‌ఖాన్‌గూడ, బడంగ్‌పేట ప్రాంతాల్లో కొత్తగా నిర్మించిన రెండు 33/11 కేవీ సబ్‌స్టేషన్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు.

విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారిస్తున్నామని వెల్లడించారు.విద్యుత్ డిమాండ్ పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని ఉత్పత్తి, సరఫరా, పంపిణీ వ్యవస్థలను సమర్థంగా నిర్వహించాలని భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. ప్రజలకు, రైతులకు విద్యుత్ పరంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.ఈ సమీక్షలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేష్ వి. పాటిల్, డైరెక్టర్లు శివాజీ, చక్రపాణి, నరసింహతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించేందుకు అనుమతివ్వాలి

న్యూఢిల్లీ,నవంబర్ 16(పి.సి.డబ్ల్యూ. న్యూస్):ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించేందుకు అనుమతించాలని ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టును కోరారు. ఈ మేరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు, ఎన్నికల సంఘం ఐటీ విభాగం డైరెక్టర్ జనరల్‌కు 48 ప్రశ్నలు సంధించేందుకు అనుమతి ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో పాటు మరో పది మంది కూటమి నేతలు ఈ అభ్యర్థనలో భాగస్వాములయ్యారు.ఎన్నికల సంఘం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌లో తమ సందేహాలకు సరైన సమాధానాలు ఇవ్వలేదని ఇండియా కూటమి నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ నిర్వహించాలని ఎవరు నిర్ణయించారు? అందుకు ఎప్పుడు ఆమోదం తెలిపా రు? ఓటర్ల జాబితాలో పేర్లు చేర్చేందుకు ఉపయోగించే ఫారం-6లో మార్పులు చేయాలని ఎవరు నిర్ణయిం చారు? ఈ నిర్ణయాలకు ఎన్నికల కమిషనర్లందరి ఆమోదం ఉందా? అనే ప్రశ్నలను లేవనెత్తారు.అలాగే ఎన్నికల సంఘానికి చెందిన ఈఆర్ఓనెట్, ఈసీఐనెట్ డిజిటల్ వ్యవస్థలను కేంద్రీకరించాలనే నిర్ణయం ఎవరు తీసుకున్నారు? ప్రధాన ఎన్నికల కమిషనర్ తీసుకున్న నిర్ణయాలతో మిగిలిన ఇద్దరు కమిషనర్లు ఎన్నిసార్లు విభేదించారు? వారి అభ్యంతరాలు అధికారికంగా నమోదు చేశారా? అనే అంశాలపై వివరాలు కోరారు.గతంలో ఎన్నికల సంఘం దాఖలు చేసిన అఫిడవిట్లు తమ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేదని ప్రతిపక్ష నేతలు పేర్కొన్నారు.48 ప్రశ్నలకు సంబంధిత అధికారులు అఫిడవిట్ల రూపంలో సమాధానాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయంగా, న్యాయపరంగా చర్చ మరింత వేడెక్కింది.ఎన్నికల సంఘం మాత్రం ఎస్ఐఆర్‌కు సంబంధించిన కీలక నిర్ణయాలన్నీ ముగ్గురు సభ్యుల ఏకాభిప్రాయంతోనే తీసుకున్నామని ఇప్పటికే కోర్టుకు తెలిపింది.ప్రతిపక్ష కూటమి లేవనెత్తిన ప్రశ్నలపై సుప్రీంకోర్టు ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

రామోజీ సేవలు చిరస్మరణీయం

(మొదటి పేజీ తరువాయి)

అవార్డుల ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తొమ్మిది రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు అవార్డులు అందజేశారు.ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. కృష్ణా జిల్లాలోని సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన రామోజీరావు తన కృషి, పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. తెలుగు పాఠకులకు ప్రతిరోజూ తాజా సమాచారాన్ని అందించాలనే లక్ష్యంతో ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. దేశంలోని రాజకీయ, సామాజిక అంశాలపై ఆయనకు లోతైన అవగాహన ఉండేదని, సమస్యలను విశ్లేషించి పరిష్కారాలను సూచించడంలో ప్రత్యేకత చూపేవారని గుర్తుచేశారు.రామోజీరావు సూచించిన రాజకీయ విశ్లేషణలు అనేక సందర్భాల్లో నిజమయ్యాయని అమిత్ షా పేర్కొన్నారు. సినిమా రంగానికి కూడా ఆయన విశేష సేవలు అందించారని, రామోజీ ఫిలింసిటీ సినీ నిర్మాణానికి అవసరమైన అన్ని సదుపాయాలను ఒకే చోట కల్పిస్తోందని అన్నారు.ం

రామోజీరావుకు పద్మవిభూషణ్ పురస్కారం రావడం తెలుగు ప్రజలకు, పాత్రికేయ రంగానికి దక్కిన గౌరవమని తెలిపారు. వచ్చే పదేళ్లలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.**రామోజీ జయంతి రాష్ట్ర పండుగ** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రామోజీరావు జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇకపై ప్రతి సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని వెల్లడించారు.

రామోజీ పేరుతో అవార్డులు ఏర్పాటు చేసి, జయంతి సందర్భంగా ప్రదానం చేయడం మంచి పరిణామమన్నారు.

జర్నలిజం, కళలు, సంస్కృతి, గ్రామీణాభివృద్ధివ్యవసాయం, మహిళా సాధికారత, సైన్స్ అండ్ టెక్నాలజీ, సామాజిక సేవ, యువ ప్రతిభ, విద్య, వైద్యంఆరోగ్యం వంటి రంగాల్లో విశేష సేవలు అందించిన వారిని గుర్తించి పురస్కారాలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఈనాడు గ్రూప్ సీఎండీ సీహెచ్ కిరణ్, రామోజీ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు అవినీతిపై విచారణ జరగాలి: కవిత

- **ప్రజాక్షేత్రంతో పాటు న్యాయపోరాటం చేస్తాం**
- **త్వరలో భైరవ వాహనంతో రాష్ట్రవ్యాప్త యాత్ర**

హైదరాబాద్,నవంబర్ 16(పి.సి.డబ్ల్యూ. న్యూస్): మాజీ మంత్రి హరీశ్‌రావు అవినీతిపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఆయన అవినీతికి సంబంధించిన ఆధారాలను సీబీసీఐడీ, కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు అందజేస్తామని తెలిపారు. తప్పు చేసిన వారెవరైనా చట్టప్రకారం శిక్ష పడే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా ఆమె మీడియాతో మాట్లాడారు.**కరువుపై సీఎం నిర్లక్ష్యం** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కవిత విమర్శించారు. ఇటీవల ప్రధాని మోడీని కలిసిన ముఖ్యమంత్రి రాష్ట్రంలోని కరువు పరిస్థితులు, రైతుల సమస్యలను ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు.

పెండింగ్‌లో ఉన్న బీసీ బిల్లుపై కూడా ప్రధానితో మాట్లాడకపోవడాన్ని తప్పుబట్టారు. రాష్ట్రంలో కరువు మండలాలను ప్రకటించి, పంటలు వేయవద్దని సూచించిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.**రాష్ట్రవ్యాప్తంగా భైరవ యాత్ర** ప్రజలకు ఉచిత విద్య, వైద్యం అందించడంతో పాటు అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కల్పించడమే తమ పార్టీ లక్ష్యమని కవిత తెలిపారు. పాంచజన్య సంకల్పంలో భాగంగా త్వరలో భైరవ వాహనంతో రాష్ట్రవ్యాప్తంగా యాత్ర చేపడతామని ప్రకటించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, జాబ్ క్యాలెండర్ కూడా ప్రకటించలేదని విమర్శించారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఇంటర్మీడియట్ బోర్డును రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

పోలీసు బ్యాండ్లతో దేశ సమైక్యతకు సంగీత సవ్వడి



హైదరాబాద్,నవంబర్ 16(పి.సి.డబ్ల్యూ. న్యూస్): పోలీసు బ్యాండ్లు కేవలం సంగీత ప్రదర్శనలకే పరిమితం కావని, క్రమశిక్షణ, ఐక్యత, దేశభక్తికి ప్రతీకలని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. రంగారెడ్డి జిల్లా సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో సోమవారం 27వ అఖిల భారత పోలీసు బ్యాండ్ పోటీలను ఆయన ప్రారంభించారు.నవంబర్ 16 నుంచి 20 వరకు ఐదు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 25కు పైగా పోలీసు, కేంద్ర సాయుధ బలగాల బ్యాండ్ బృందాలకు చెందిన సుమారు 1,500 మంది పాల్గొంటున్నారు. బ్రాస్ బ్యాండ్, పైప్ బ్యాండ్, బ్యూగిల్ విభాగాల్లో తమ సంగీత ప్రతిభను చాటనున్నారు.ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. పోలీసు బ్యాండ్లు బలగాల క్రమశిక్షణ, గౌరవం, ఐక్యతకు ప్రతిబింబాలని పేర్కొన్నారు. ఇలాంటి పోటీలు వివిధ రాష్ట్రాల బలగాల మధ్య స్నేహభావం, సమన్వయం, జాతీయ సమైక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. **ప్రజల కోసం ప్రత్యేక సంగీత ప్రదర్శనలు** నవంబర్ 17న శిల్పారామంలో, 18న లుంబినీ పార్కులో సాయంత్రం ప్రత్యేక బ్యాండ్ ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ప్రజలు కూడా ఈ సంగీత వేడుకలను వీక్షించి ఆస్వాదించాలని నిర్వాహకులు కోరారు.

అమెరికా ఆధిపత్యంపై ఆసియాలో నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

నేతృత్వంలోని 'పాక్స్ సిలికా' కార్యక్రమాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు రోజులుగా కొనసాగుతున్న నిరసనల్లో ఆందోళనకారులు, పోలీసుల మధ్య ఘర్షణలు చోటుచేసుకోగా పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.మరోవైపు చైనా ఆగ్నేయాసియా దేశాలతో వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటోంది. చైనా ప్రధాని లీ కియాంగ్ మనీలాలో జరిగిన ఆసియాన్ సమావేశంలో మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఏకపక్ష విధానాలు, రక్షణాత్మక వాణిజ్య ధోరణులు, అంతర్జాతీయ ఘర్షణలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో చైనా, ఆగ్నేయాసియా దేశాలు ఐక్యంగా ఉండాలని, బయటి దేశాల జోక్యాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. గతేడాది చైనా, ఆసియాన్ దేశాల మధ్య వాణిజ్యం లక్ష కోట్ల డాలర్లు దాటిందని తెలిపారు.**క్వాడ్ సమావేశంపై ఆసక్తి** ట్రంప్ పర్యటనలో భాగంగా ఆసియాన్ దేశాల నేతలతో పాటు అమెరికా, భారత్, జపాన్, ఆస్ట్రేలియా సభ్యులుగా ఉన్న 'క్వాడ్' కూటమి సమావేశం కూడా జరగనుంది. రెండేళ్ల తర్వాత ఈ నాలుగు దేశాల నేతలు సమావేశం కానుండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ భేటీలో ప్రధాని మోడీ పాల్గొననున్నారు. ఆసియాలో అమెరికా అనుసరిస్తున్న వ్యూహాలకు భారత్ ఎంతవరకు మద్దతు ఇస్తుందన్న అంశంపై ఆసక్తి నెలకొంది.ఇదిలా ఉండగా, చైనా-ఆసియాన్ సంబంధాలు బలోపేతమవుతున్నప్పటికీ ఆగ్నేయాసియా దేశాలు అమెరికాతోనూ వాణిజ్య సంబంధాలను విస్తరించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. మయన్మార్‌లో సైనిక పాలకులను ఆసియాన్ సమావేశాలకు దూరంగా ఉంచే విధానాన్ని కొనసాగించాలని నేతలు నిర్ణయించారు. శాంతి ప్రణాళికపై పురోగతి సాధిస్తేనే తిరిగి అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు.

కుటుంబంపై నిజాలు చెప్పేందుకే ఆత్మకథ: సోనియా

(మొదటి పేజీ తరువాయి)

పెళ్లి తర్వాత అత్తారింట్లో కొత్త వాతావరణానికి అలవాటు పడటం ప్రతి మహిళకు ఎదురయ్యే అనుభవమేనని పేర్కొన్నారు. ఇందిరాగాంధీ అంటే తొలినాళ్లలో ఎంతో గౌరవంతో పాటు భయం ఉండేదని, ఆమె నుంచి క్రమశిక్షణ, ధైర్యం నేర్చుకున్నానని గుర్తుచేసుకున్నారు. రాజీవ్‌గాంధీ హత్య గురించి రాయడం తనకు అత్యంత బాధాకరమైన అనుభవమని తెలిపారు.**తల్లిదండ్రుల ప్రేమను గుర్తుచేసుకున్న రాహుల్** ఈ సందర్భంగా రాహుల్‌గాంధీ తన తల్లిదండ్రులు రాజీవ్, సోనియాల అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. చిన్నతనంలో ప్రతి భోజన సమయంలో తండ్రి ఒడిలో తల్లి కూర్చునేవారని, వారి మధ్య ఉన్న ప్రేమను చూసి అదే సాధారణ కుటుంబ జీవితం అనుకునేవాడినని చెప్పారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీల హత్యలు తమ కుటుంబానికి తీరని లోటుగా మిగిలాయని ఆవేదన వ్యక్తం చేశారు.రాజీవ్ మరణం తర్వాత తల్లి తీవ్ర విషాదంలో కూరుకుపోయారని, ఆ సమయంలో తాను, ప్రియాంక ఆమెకు అండగా నిలిచామని తెలిపారు. సోనియా నాలుగుసార్లు క్యాన్సర్‌ను జయించారని, జీవితంలో ఎప్పుడూ భయపడటం లేదా వెనకడుగు వేయడం చూడలేదని చెప్పారు. "అమ్మా.. నాన్న నిన్ను ఎంతో ప్రేమించారు. నిన్ను చూసి ఆయన ఎంత గర్వపడేవారో చెప్పలేను" అంటూ రాహుల్ భావోద్వేగంగా ప్రసంగించారు.**పుస్తకానికి విశేష స్పందన** నవంబర్ 10న మార్కెట్‌లోకి వచ్చిన 'బిలాంగింగ్' పుస్తకానికి పాఠకుల నుంచి మంచి స్పందన లభించింది. వారం రోజుల్లోనే రెండు లక్షలకు పైగా ప్రతులు అమ్ముడైనట్లు ప్రచురణ సంస్థ హార్పర్ కాలిన్స్ వెల్లడించింది. కార్యక్రమానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, పలువురు ప్రతిపక్ష నేతలు హాజరయ్యారు.

ఖేలో ఇండియా గేమ్స్‌కు పటిష్ఠ ఏర్పాట్లు

హైదరాబాద్,నవంబర్ 16(పి.సి.డబ్ల్యూ. న్యూస్):

తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్2026ను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరిగే ఈ జాతీయ స్థాయి పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని సూచించారు. క్రీడాకారులకు నాణ్యమైన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు క్రీడా వేదికలను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈ పోటీలు హైదరాబాద్‌లోని పలు స్టేడియాలతో పాటు హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ నగరాల్లో జరగనున్నాయి. దేశవ్యాప్తంగా సుమారు 8 వేల మంది క్రీడాకారులు, అధికారులు, సహాయక సిబ్బంది తెలంగాణకు రానున్నారు.**విస్తృత ప్రచారానికి ప్రణాళిక** ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రధాన కూడళ్లు, బహిరంగ ప్రదేశాల్లో హోర్డింగ్‌లు, బెలూన్లతో పాటు క్రీడల మస్కట్, లోగోలను ప్రదర్శించాలని సీఎస్ సూచించారు. శంషాబాద్ విమానాశ్రయం, ప్రధాన రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. క్రీడల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా టార్చ్ ర్యాలీలు నిర్వహించాలని పేర్కొన్నారు.**వసతి, రవాణా ఏర్పాట్లు** క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని, క్రీడాకారులకు నాణ్యమైన వసతి కల్పించాలని సంజయ్ జాజు ఆదేశించారు. క్రీడాకారులు పోటీలు జరిగే వేదికలకు చేరుకునేందుకు ప్రత్యేక రవాణా సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలల నుంచి విద్యార్థులను స్టేడియాలకు తీసుకువచ్చేందుకు కూడా తగిన రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు. యువత పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలని, మంత్రి, మాజీ క్రికెటర్ అజహరుద్దీన్ వంటి ప్రముఖ క్రీడాకారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. క్రీడాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీబాలాదేవి, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్, ఆయా జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ పగ్గాలు చేపట్టిన అనిల్ కుమార్

- **తెలంగాణ ఆర్టీసీ నూతన వైస్ చైర్మన్, ఎండీగా బాధ్యతల స్వీకరణ**
- **వై. నాగిరెడ్డి స్థానంలో నియామకం.. బస్‌భవన్‌లో బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐపీఎస్ అధికారి**



హైదరాబాద్,నవంబర్ 16(పి.సి.డబ్ల్యూ. న్యూస్): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) నూతన వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి డాక్టర్ అనిల్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో అధికారుల సమక్షంలో ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు.ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉన్నతాధికారుల బదిలీల్లో భాగంగా నవంబర్ 12న అనిల్ కుమార్‌ను ఆర్టీసీ ఎండీగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు నిర్వహించిన వై. నాగిరెడ్డిని పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా బదిలీ చేసింది.1996 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అనిల్ కుమార్ గతంలో తెలంగాణ గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల ఆపరేషన్స్ డీజీపీగా పనిచేశారు. పోలీసు శాఖలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఆయన తాజాగా రాష్ట్ర ప్రజా రవాణా సంస్థకు నాయకత్వం వహించనున్నారు.

280 కుటుంబాలకు సొంతింటి భాగ్యం







- తొర్రూరులో డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రారంభం.. లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 16(పి.సి.డబ్ల్యూ. న్యూస్): ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదల సొంతింటి కల నెరవేరింది. తొర్రూరు పట్టణంలోని దుబ్బా తండా 5వ వార్డులో నిర్మించిన 280 డబుల్ బెడ్‌రూం ఇళ్లను పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రు నాయక్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం అర్హులైన 280 మంది లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు.గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన ఈ ఇళ్లు కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉండటంతో పేదలు వాటి పంపిణీ కోసం పలుమార్లు ఎమ్మెల్యేను కోరారు. వారి ఇబ్బందులను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇళ్ల కేటాయింపు చేపట్టారు. ఇళ్ల పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.**స్థలదాతకు సన్మానం**280 ఇళ్ల నిర్మాణానికి స్థలం అందించిన దాతను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. నిరుపేద కుటుంబాల సొంతింటి కల నెరవేర్చేందుకు విలువైన స్థలాన్ని అందించడం అభినందనీయమని పేర్కొన్నారు.లబ్ధిదారులు, స్థానికులు డోలు చప్పుళ్లు, మంగళవాయిద్యాల మధ్య ప్రజాప్రతినిధులకు ఘన స్వాగతం పలికారు. ఇళ్ల మంజూరుతో తమ కుటుంబాలకు భరోసా లభించిందని, సొంతింటిలో సంతోషంగా జీవిస్తామని లబ్ధిదారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్, వైస్ చైర్మన్ సోమా రజిని రాజశేఖర్, వార్డు కౌన్సిలర్ చపాల బాపు రెడ్డి, ఇతర కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

రేగొండలో హరి ప్లెక్సీ ప్రింటింగ్ మిషన్ ప్రారంభం





రేగొండ, నవంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన హరి ప్లెక్సీ ప్రింటింగ్ షాపును ఎస్పై సుధాకర్ ప్రారంభించారు.ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న వినయ్ తన స్వయం ఉపాధిలో భాగంగా నూతనంగా కొనుగోలు చేసిన ప్లెక్సీ ప్రింటింగ్ మిషన్‌ను ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పై సుధాకర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎస్పై సుధాకర్ మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. నూతనంగా వ్యాపారం ప్రారంభించిన వినయ్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు,స్థానిక ప్రముఖులు, మిత్రులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆర్టీసీ నూతన వీసీ అండ్ ఎండీగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అనిల్ కుమార్



హైదరాబాద్ నవంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నూతన వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గా సీనియర్ ఐపీఎస్ అధికారి డాక్టర్ అనిల్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ బస్ భవన్‌లో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ ఉన్నతాధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు.బాధ్యతల స్వీకరణ అనంతరం ఎండీ డాక్టర్ అనిల్ కుమార్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు (ఈడీలు) సిహెచ్. వెంకన్న, ఎం. రాజశేఖర్, సాలోమాన్ రాజ్, ఖుష్రో షా ఖాన్, ఏ. శ్రీధర్, ఫైనాన్షియల్ అడ్వైజర్ విజయపుష్ప లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సంస్థ ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, ఆపరేషన్స్, ప్రయాణికులకు అందుతున్న రవాణా సదుపాయాలు మరియు కొనసాగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా ఎండీ డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ, సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపి సంస్థను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.అదేవిధంగా, రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు మరింత సురక్షితమైన, సౌకర్యవంతమైన మరియు నాణ్యమైన ప్రయాణ సేవలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రయాణికుల ఆదరణను మరింత పెంచుకోవాలని, టీమ్ వర్క్‌తో పనిచేసి టీజీఎస్ఆర్టీసీని దేశంలోనే అగ్రగామి రవాణా సంస్థగా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పేదింటి ఆడపిల్ల పెళ్లికి పెద్దమనసుతో చేయూత

- దివంగత దుడ్డెల కొమురయ్యఎల్లమ్మల జ్ఞాపకార్థం పుస్తె మట్టెల పంపిణీ



జవహర్‌నగర్, నవంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్): దివంగత కామ్రేడ్స్ దుడ్డెల కొమురయ్య, ఎల్లమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు బిజిలి రవీందర్ పేదింటి ఆడపిల్ల వివాహానికి పుస్తె మట్టెలు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. మరోవైపు బూడిద వెంకటేష్ 25 కిలోల బియ్యం బస్తాను అందజేసి వివాహ ఖర్చులకు తనవంతు సహకారం అందించారు.తెలంగాణ వికలాంగుల హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెరుగు శివకృష్ణ ఆధ్వర్యంలో, న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ అధ్యక్షుడు వెలిగొండ వెంకటస్వామి చొరవతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. జవహర్‌నగర్ వికలాంగుల కాలనీలోని బిజిలి టీవీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిజాంపేటబాచుపల్లి ప్రాంతానికి చెందిన దివ్యాంగ దంపతులు మల్లిగారి సత్యనారాయణ, స్వప్నల రెండో కుమార్తె సౌజన్య వివాహాన్ని పురస్కరించుకుని ఈ సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, నిరుపేద కుటుంబాలు నిత్యావసరాల కోసం సైతం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, అలాంటి పరిస్థితుల్లో ఆడపిల్లల వివాహం తల్లిదండ్రులకు మరింత భారంగా మారుతోందని అన్నారు. పేద కుటుంబాలకు అండగా నిలవాలనే సంకల్పంతో వివాహానికి అవసరమైన పుస్తె మట్టెలు, బియ్యం అందించినట్లు తెలిపారు. మరణించిన తల్లిదండ్రుల జ్ఞాపకాలను సేవా కార్యక్రమాల ద్వారా చిరస్థాయిగా నిలబెట్టుకోవడం ఎంతో సంతృప్తినిస్తుం దని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో న్యూ శక్తి దివ్యాంగుల సంస్థ అధ్యక్షుడు వెలిగొండ వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి టి. చిరంజీవి, సొసైటీ సభ్యుడు రాజనాల కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకుడు బండకింది ప్రసాద్, రెండో డివిజన్ కార్యదర్శి బూడిద వెంకటేష్, సీనియర్ పత్రికా విలేకరి దుర్గమ్మ స్వామి, బలగం టీవీ సీఈఓ చింతల విజయ్ కుమార్, స్టార్ న్యూస్ టీవీ9 రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

నెల మొదటి తేదీనే జీతాలు చెల్లించాలి.. సమ్మె కాలపు వేతనాలు విడుదల చేయాలి: కేంద్ర మంత్రి బండి సంజయ్





కరీంనగర్, నవంబర్ 16 (పి.సి.డబ్ల్యూ. న్యూస్): నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తక్షణమే క్రమబద్ధీకరించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే వారి పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగ సంఘాల జేఏసీ అధ్యక్షుడు రమేశ్ ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు సోమవారం కరీంనగర్‌లోని బండి సంజయ్ నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులందరికీ 100 శాతం గ్రాస్ వేతనాలు చెల్లించాలని, జీవో నంబర్ 60, 1195 ప్రకారం జీతాలు అమలు చేయాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేసి ఉద్యోగులను స్టేట్ హెల్త్ సొసైటీ పరిధిలోకి తీసుకురావాలని, స్పార్క్ విధానం ద్వారా వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించడంతోపాటు పీఆర్సీ ప్రయోజనాలు కల్పించాలని, సమ్మె కాలానికి నిలిపివేసిన వేతనాలను పూర్తిగా విడుదల చేయాలని కోరారు. గతంలో ప్రభుత్వం 90 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతోనే సమ్మె విరమించామని ఉద్యోగ సంఘాల నాయకులు వివరించారు.బండి సంజయ్ ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఉద్యోగులకు న్యాయం జరగకపోతే వారి పోరాటానికి బీజేపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణను తప్పనిసరిగా అమలు చేయాలి

● మాదిగ, ఇతర ఎస్సీ ఉపకులాల నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలి డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్



ఖమ్మం, ప్రతినిధి నవంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో సామాజిక న్యాయం కేవలం మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో అమలు కావాలని, ముఖ్యంగా ప్రభుత్వ నర్సింగ్ ఉద్యోగాల భర్తీలో ఎస్సీ వర్గీకరణను తప్పనిసరిగా అమలు చేసి మాదిగతో పాటు ఇతర ఎస్సీ ఉపకులాల నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.ఈ మేరకు ప్రభుత్వ నర్సింగ్ ఉద్యోగాల నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన మాదిగ, ఇతర ఎస్సీ ఉపకులాల యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో సముచిత అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఎస్సీ వర్గీకరణ అమల్లోకి వచ్చిందన్నారు. అయితే ప్రభుత్వ నర్సింగ్ ఉద్యోగాల నియామకాల్లో కూడా వర్గీకరణకు అనుగుణంగా రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పించడం ద్వారా అర్హులైన నిరుద్యోగులకు న్యాయం చేయాలని స్పష్టం చేశారు.ప్రస్తుతం చేపడుతున్న నర్సింగ్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, రిజర్వేషన్ కేటగిరీల వారీగా ఉద్యోగాలను కేటాయించాలని కోరారు. ఈ విషయంలో సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, అర్హులైన అభ్యర్థులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఖమ్మం జిల్లాలో చేపడుతున్న ప్రభుత్వ నర్సింగ్ ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ అమలుపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మాదిగతో పాటు ఇతర ఎస్సీ ఉపకులాల నిరుద్యోగ యువతకు సమాన అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్‌తో పాటు నాయకులు బొడ్డు గురవయ్య మాదిగ, రాయల నాగేశ్వరరావు మాదిగ, జంగం నగేష్ మాదిగ, చాట్ల వెంకటమ్మ, వెంకన్న, మధు, వెంకయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఎగువలింగాలలో పోలీసుల గ్రామసభ



లింగాల నవంబర్ 16 (పి.సి.డబ్ల్యూ. న్యూస్): మండల పరిధిలోని ఎగువ లింగాలలో గ్రామంలో సోమవారం రాత్రి లింగాల పోలీసులు గ్రామ సభ నిర్వహించారు. ఈనెల 29వ తేదీ లింగాల మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగునున్నాయి. ఈ సందర్భంగా పంచాయితీ ఎన్నికల సమయంలో ఎలాంటి హింసాత్మక సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఎగువలింగాల లో సోమవారం రాత్రి జిల్లా ఎస్పీ నచికేతన్ ఆదేశాల మేరకు పులివెందుల డిఎస్పి మురళి , పులివెందుల సిఐ శాంతిలాల్ సూచన లతో లింగాల ఎస్ఐ డి.జగదీశ్వర్ రెడ్డి గ్రామసభను నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 29న మండల పరిధిలో జరగబోయే పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా ఓట్లు వేసేందుకు తమ సిబ్బంది మండల ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని అన్నారు.రాబోయే పంచాయితీ ఎన్నికల్లో పోటీలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్న అభ్యర్థులకు భద్రత కల్పించేందుకు తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీల్లో ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్స్ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించబోమని, చట్టపరంగా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నమైన వెంటనే నా నెంబర్ కు 91211 00551కు ఫోన్ చేసి తెలపాలని మండల ప్రజలను కోరారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఏర్పడిన వెంటనే నా నెంబర్ కు ఫోన్ చేస్తే సమస్యను పరిష్కరించేందుకు తాను సిద్ధమని లింగాల ఎస్ఐ డి. జగదీశ్వర్ రెడ్డి ప్రజలకు తెలిపారు. మీరు ఫోన్ చేసిన విషయం కూడా రహస్యంగా ఉంచుతాం, కావున మీరు ధైర్యంగా గ్రామాల్లో జరిగేటటువంటి అసాంఘిక కార్యకలాపా లు, దౌర్జన్యాలను నాకు తెలపాలని ఎస్పై జగదీశ్వర్ రెడ్డి కోరారు. రాబోయే పంచాయితీ ఎన్నికల్లో ఆయా గ్రామ ప్రజలు ప్రశాంతంగా ఎన్నికలు జరుపుకోవాలని ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి ఆకాంక్షించారు. అలాగే మహిళల భద్రత, సైబర్ నేరాల పై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బందితో పాటు ఎగువలింగాల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ముస్లింల విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ఎంఐఎం కృషి

• సాలారే మిల్లత్ గైడ్స్ పంపిణీలో ఎంఐఎం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్





రాజన్న సిరిసిల్ల నవంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో ముస్లింల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఎంఐఎం పార్టీ విశేషంగా కృషి చేస్తుందని ఎంఐఎం పార్టీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. సోమవారం రాజన్నసిరిసిల్ల పట్టణంలోని, గంభీరావుపేట, వేములవాడలో గల ప్రభుత్వ ఉర్దూ మీడియం బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ 2026 గైడ్స్ ను పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ..ఎస్సెస్సీ విద్యార్థులందరూ కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. జీవితంలో పదవ తరగతివార్షిక పరీక్షలు కీలకమని, ఈపరీక్షలో ఉత్తీర్ణులు అవ్వడానికి సాలారే మిల్లత్ గైడ్ దోహదపడుతుందని అన్నారు. హైదరాబాద్ మాజీ ఎంపీ దివంగత సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ భవిష్యత్ తరాలకు ఉన్నత విద్యను అందించాలనే సంకల్పంతో, గత 26 సంవత్సరాల క్రితం ఆల్ ఇన్ వన్ గైడ్సను, ఎంఐఎం పార్టీ తరఫున ఉచితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందజేస్తున్నట్లు చెప్పారు. సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ తర్వాత, తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీలు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో ఉర్దూను బ్రతికించడం కోసం ఉర్దూ మీడియం పాఠశాలలో, విద్యా ప్రమాణాలు పెంచడం కోసం, ముస్లింల విద్య అభివృద్ధి కోసం అమోఘమైనటువంటి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ ఎంఐఎం నాయకులు మహమ్మద్ ముస్తఫా, పర్వేజ్, సమీ, గంభీరావుపేట ఎంఐఎం నాయకులు ఇర్ఫాన్ ఖాన్, షోయబ్, గౌస్, హమీద్, అజీజ్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆపదలో జర్నలిస్ట్ కుటుంబానికి అండగా నిలిచిన మానవత్వం..!

రోశయ్య కుటుంబానికి రూ.65 వేల ఆర్థికసాయం

స్పందించిన దాతలు.. ముందుండి సహాయం చేసిన టియుడబ్ల్యూజే (ఐజేయు)

అభినందించిన డిపిఆర్వో రాజేంద్రప్రసాద్





కురవి నవంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్): ఆపదలో ఉన్న జర్నలిస్ట్ కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్న టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్‌ను మహబూబాబాద్ జిల్లా డిపిఆర్వో రాజేంద్రప్రసాద్ అభినందించారు. స్పందించే హృదయం, సాటి మనిషికి సహాయం చేసే గుణం ఎంతో గొప్ప లక్షణమని అన్నారు.కురవి మండల కేంద్రానికి చెందిన జర్నలిస్ట్ రోశయ్య కూతురు, తల్లి ఒకేసారి అనారోగ్యానికి గురై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ వెంటనే స్పందించారు. తన పిలుపుతో దాతల నుంచి ఆర్థికసాయం సమీకరించి రోశయ్య కుటుంబానికి అండగా నిలిచారు. కురవి భాస్కరనిలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లా శాఖ, భాస్కర సేవా సమితి పక్షాన సేకరించిన రూ.65 వేల నగదును డిపిఆర్వో రాజేంద్రప్రసాద్, జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ కలిసి జర్నలిస్ట్ రోశయ్య దంపతులకు అందజేశారు.ఈ సందర్భంగా డిపిఆర్వో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. మహబూబాబాద్ జిల్లాలో జర్నలిస్టులకు ఆపద వచ్చిన ప్రతిసారి సిహెచ్ శ్రీనివాస్ స్పందిస్తూ, తన మిత్రులు, దాతల సహకారంతో నిధులు సమీకరించి అనేక కుటుంబాలకు అండగా నిలుస్తున్నారని ప్రశంసించారు. జర్నలిస్టులకు భరోసాగా నిలుస్తున్న శ్రీనివాస్ సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు. సాటి మనిషికి సహాయం చేసే తత్వాన్ని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని సూచించారు.**జర్నలిస్టులకు యూనియన్ అండగా ఉంటుంది** టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. జిల్లాలో ఏ జర్నలిస్టుకు ఆపద వచ్చినా యూనియన్ పెద్దన్న పాత్ర పోషిస్తూ అండగా నిలుస్తుందని తెలిపారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ ప్రోత్సాహంతో జిల్లాలో మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు.జర్నలిస్ట్ రోశయ్య కుటుంబానికి గతంలో రూ.15 వేలు, ప్రస్తుతం రూ.50 వేలు కలిపి మొత్తం రూ.65 వేల ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. తన పిలుపునకు స్పందించి ఆర్థిక సహకారం అందించిన దాతలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.తీవ్ర విషాద సమయంలో తన కుటుంబాన్ని ఆదుకుని, ఆర్థికసాయం చేయడంతో పాటు కుటుంబసభ్యుల్లా ధైర్యం నింపిన టియుడబ్ల్యూజే (ఐజేయు) యూనియన్‌కు, జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్‌కు, యూనియన్ బాధ్యులకు ఎప్పటికీ రుణపడి ఉంటామని జర్నలిస్ట్ రోశయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో దాడుల నియంత్రణ కమిటీ జిల్లా కో-కన్వీనర్ బేతమల్ల సహదేవ్, కురవి మండల అధ్యక్షుడు గుంటి సురేష్, సీనియర్ జర్నలిస్ట్ సంగెం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


సీనియర్ పాత్రికేయుడు మడ్లపల్లి జలపతికి ఘన సత్కారం

- జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా సన్మానించిన విలేకరి జంగిలి మహేందర్



గంగాధర నవంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ జిల్లా గంగాధర మండలానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు మడ్లపల్లి జలపతిని స్థానిక విలేకరి జంగిలి మహేందర్ ఘనంగా సత్కరించారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జలపతిని శాలువాతో సన్మానించి, జ్ఞాపికతో పాటు చిరుబహుమానాన్ని అందజేశారు.ఈ సందర్భంగా జంగిలి మహేందర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన పత్రికా రంగంలో మడ్లపల్లి జలపతి ఎన్నో ఏళ్లు నిబద్ధతతో పనిచేస్తూ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. గ్రామీణ ప్రాంత సమస్యల పరిష్కారంలో ఆయన అందించిన సేవలు ఎంతో మంది యువ పాత్రికేయులకు ఆదర్శమని, స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.అనంతరం సీనియర్ పాత్రికేయుడు మడ్లపల్లి జలపతి మాట్లాడుతూ.. జాతీయ పత్రికా దినోత్సవం రోజున తోటి విలేకరి తనను గుర్తుంచుకుని సన్మానించడం ఎంతో ఆనందంగా ఉందని కృతజ్ఞతలు తెలిపారు. పత్రికా విలువలను, నిష్పక్షపాతంగా వార్తలను అందిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలవాలని,ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారదిగా ఉండాలని యువ విలేకరులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లింగన్న,నర్సయ్య,లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు



రామడుగు, నవంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్): రామడుగు మండలం చిప్పకుర్తి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు ములుగురి తిరుపతి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో నాయకులతో కలిసి పాల్గొన్న బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, వీర్ల వెంకటేశ్వర రావు, పార్టీ మండల శాఖ అధ్యక్షులు గంట్ల జితేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ గాదే మధుకర్ రెడ్డి,గంగాధర సింగిల్ విండో చైర్మన్ దూలం బాల గౌడ్, జిల్లా రైతు బంధు సమితి మాజీ సబ్యులు వీర్ల సంజీవ్ రావు,సర్పంచులు, మాజీ సర్పంచ్ లు, మాజీ ఎంపీటీసీ లు తదితరులు పాల్గొన్నారు..


వెంకట్రావుపల్లిలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం..



రామడుగు నవంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్): రామడుగు మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో దైవాల సునీత మల్లేశం గౌడ్ కు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు సోమవారం రోజున గృహప్రవేశం ఘనంగా జరిగింది.. ఈ కార్యక్రమంలో వెంకట్రావుపల్లి సర్పంచ్ కత్తి సమత మధు గౌడ్, ఉప సర్పంచ్ బద్దం లక్ష్మారెడ్డి, చొప్పదండి సూర్య రిపోర్టర్ కందుల స్వైలాబ్ గౌడ్, రామడుగు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జవ్వాజి హరీష్, రామడుగు ప్యాక్స్ చైర్మన్ కోలా రమేష్, వైస్ చైర్మన్ బద్దం లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్ ఫోరంలో అధ్యక్షుడు మనీష్,, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పంజాల శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు దైవాల మల్లేశం గౌడ్, మాజీ అధ్యక్షుడు పొన్నంవీరగౌడ్, వార్డు సభ్యుడు దైవాల సాయి గౌడ్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో ఆదార్ పార్టీ.. అభ్యర్థిగా బుర్ర సైదారావు ఖరారు!

- అభ్యర్థిని ఖరారు చేసిన ఆధార్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఈడా శేషగిరిరావు


ALLIANCE OF DEMOCRATIC REFORMS PARTY

ఆధార్ పార్టీ Aadar Party

Dr. Eada Seshagiri Rao
PRESIDENT
Ph: 9246503889

CHAPATI ROLLER


TO WHOMSOEVER IT MAY CONCERN

I hereby announce the following person as our party candidate for the forthcoming bienniel elections of Telangana Legislative Council from the below Graduates' Constituency.

Name of Graduates' Constituency	Selected Candidate
Nalgonda-Khammam-Warangal	Shri Burra Saida Rao (BC / Goud)

(Dr. Eada Seshagiri Rao)
President

Flat No.106, Sai Sri Towers, 3-6-429, Street No.4, Himayath Nagar, Hyderabad-500029, Telangana.
(Registration No. 56/222/2022-23/PPS-IV, Dated 18-04-2023)
Ph: 9246503889 • Email: info@aadarparty.org • www.aadarparty.org



హైదరాబాద్, ప్రతినిధి నవంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్): తెలంగాణ శాసనమండలి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదార్ పార్టీ (అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ) ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమైంది. నల్గొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి తమ పార్టీ అభ్యర్థిగా బుర్ర సైదారావును ఖరారు చేస్తూ ఆధార్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఈడా శేషగిరిరావు అధికారిక ప్రకటన విడుదల చేశారు. దీంతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆదార్ పార్టీ తరఫున బుర్ర సైదారావు పోటీ చేయడం ఖరారైంది.ఈ సందర్భంగా తనకు అభ్యర్థిగా అవకాశం కల్పించిన ఆదార్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఈడా శేషగిరిరావుకు బుర్ర సైదారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని పట్టభద్రుల నియోజకవర్గానికి అభ్యర్థిగా ఎంపిక చేయడం తనకు ఎంతో సంతోషాన్ని, బాధ్యతను కలిగించిందని పేర్కొన్నారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్తానని బుర్ర సైదారావు పేర్కొన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ పట్టభద్రులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయడం, విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం, యువతకు ఉపాధి అవకాశాలు, ప్రైవేటు మరియు ప్రభుత్వ రంగ ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. పట్టభద్రుల ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ వారి సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపించడమే తన ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని పట్టభద్రులను ప్రత్యక్షంగా కలుసుకుని వారి అభిప్రాయాలను తెలుసుకుంటానని, ప్రతి ఒక్కరి సమస్యను అర్థం చేసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు. ఆదార్ పార్టీ సిద్ధాంతాలు, విధానాలను పట్టభద్రులకు వివరించి వారి మద్దతు కూడగట్టేందుకు కృషి చేస్తానని చెప్పారు.తన అభ్యర్థిత్వానికి సహకరిస్తున్న పార్టీ రాష్ట్రస్థాయి నాయకులకు, జిల్లా నాయకులకు, పార్టీ శ్రేణులకు, అభిమానులకు బుర్ర సైదారావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి తన విజయానికి సహకరించాలని కోరారు.మరోవైపు ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీలు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై దృష్టి సారిస్తున్న నేపథ్యంలో ఆదార్ పార్టీ అభ్యర్థిగా బుర్ర సైదారావు బరిలోకి దిగడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో పట్టభద్రుల మద్దతు కూడగట్టుకుని ఎన్నికల్లో తనదైన ముద్ర వేయాలని ఆదార్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఈడా శేషగిరిరావు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పట్టభద్రుల ఆదరణతో విజయం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతానని బుర్ర సైదారావు ధీమా వ్యక్తం చేశారు.

కొరటపల్లిలో జల సంరక్షణ పనులకు శ్రీకారం

- సర్పంచ్ మేకల మహేశ్వరి ప్రభాకర్ యాదవ్

రామడుగు, నవంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్): ఎల్‌నినో ప్రభావం కారణంగా భవిష్యత్తులో తలెత్తే నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం కొరటపల్లి గ్రామంలో జల సంరక్షణ పనులు చేపట్టారు.గ్రామ సర్పంచ్ శ్రీమతి మహేశ్వరి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో నేడు ప్రభుత్వ పాఠశాలలోని బోరుబావికి రీచార్జ్ పనులను ప్రారంభించడంతో పాటు, గ్రామ వార్డు సభ్యునికి చెందిన భూమిలో ఫామ్ పాండ్ నిర్మాణానికి పూజా కార్యక్రమం నిర్వహించారు.పాఠశాల బోరుబావి రీచార్జ్ పనుల ద్వారా విద్యార్థులకు తాగునీరు, ఇతర అవసరాలకు నీటి లభ్యత మెరుగుపడటంతో పాటు భూగర్భ జలమట్టాల పెంపునకు అవకాశం కలుగుతుంది. ఫామ్ పాండ్ నిర్మాణం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి, రైతులకు వ్యవసాయ అవసరాలకు నీటి వనరుగా ఉపయోగపడేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేశ్వరి ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గ్రామంలో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రైతులు, గ్రామ ప్రజలు, ముఖ్యంగా పాఠశాల విద్యార్థులకు నీటి ఇబ్బందులు కలగకుండా అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుంటూ అవసరమైన అన్ని చర్యలను సాధ్యమైనంత మేరకు చేపడతామని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజల సంక్షేమం, రైతుల ప్రయోజనాల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో గ్రామ ప్రజలు, పాలకమండలి, పంచాయతీ సెక్రెటరీ, సంబంధిత ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం పార్టీలన్నీ ఏకం

- ఖమ్మం కలెక్టరేట్ ఎదుట టీజేఎఫ్ ధర్నా.. సమస్య పరిష్కారానికి నేతల హామీ

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్): ఖమ్మం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జర్నలిస్టు ఫోరం (టీజేఎఫ్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్‌కు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం సహా పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఖమ్మం జర్నలిస్టుల కోసం 23.2 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలిపి జీవో 147 విడుదల చేసిందన్నారు. ఎన్నికల కారణంగా ప్రక్రియ నిలిచిపోయిందని, ప్రస్తుతం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు చొరవ తీసుకొని ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వం మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల పోరాటం న్యాయబద్ధమైనదని, సమస్యను ముగ్గురు







మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఖమ్మం అర్బన్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి కూడా జర్నలిస్టులకు అండగా ఉంటామని తెలిపారు.బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవ్, జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. జర్నలిస్టులకు కేటాయించిన స్థలంలో ఫెన్సింగ్ తొలగించి, ఇళ్ల స్థలాల పంపిణీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. జనసేన నాయకులు గడల శ్రీనివాస్, మిర్యాల రామకృష్ణ కూడా తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు.టీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ.. మూడు దశాబ్దాలుగా జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని, సమస్య పరిష్కారం కాకపోతే దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. జర్నలిస్టుల కాలనీకి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీజేఎఫ్ నాయకులు, జర్నలిస్టులు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మానకొండూరు ప్రభుత్వ కళాశాలలో ఎంఎస్ఎఫ్ కమిటీ ఏర్పాటు








మానకొండూరు, నవంబర్ 16 (పి.సి.డబ్ల్యూ. న్యూస్): పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎంఎస్ఎఫ్ నూతన నిర్మాణంలో భాగంగా కరీంనగర్ జిల్లా మానకొండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అట్టడుగు వర్గాలు అభివృద్ధి చెంది సమాన హక్కులు, అవకాశాలు, గౌరవం పొందాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు.కళాశాల అధ్యక్షుడిగా టీ. వినయ్ కుమార్ మాదిగ, అధికార ప్రతినిధిగా కనకం సుశాంత్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా రామగిరి మోహన్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా కందుకూరి శ్రీధర్ మాదిగ, కార్యదర్శిగా రోడ్డ ఉదయ మాదిగ, సహాయ కార్యదర్శిగా గొల్లపెల్లి అఖిల్ మాదిగలను నియమించారు. కార్యవర్గ సభ్యులుగా కె. సిద్దు మాదిగ, వి. శశికుమార్ మాదిగ ఎంపికయ్యారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి చంచల నవీన్ మాదిగ, ఎంఆర్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు బెజ్జంకి అనిల్ మాదిగ, సీనియర్ నాయకుడు కొత్తూరి రాజయ్య మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి కనకం గంగా నరేష్ మాదిగ, జిల్లా కో-ఇన్‌చార్జి తాండ్ర శ్రీనివాస్ మాదిగ తదితరులు పాల్గొన్నారు. కళాశాల విద్యార్థులు హాజరయ్యారు.

రేకుర్తి 22ఏ భూ సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు

• సీసీఎల్ఏకు సమగ్ర నివేదిక పంపించాం: కలెక్టర్

కరీంనగర్, నవంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్): రేకుర్తి, విద్యానగర్ ప్రాంతాల్లో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న ఇళ్లు, ప్లాట్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు వేగవంతం చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే సమగ్ర నివేదిక, ప్రతిపాదనలను సీసీఎల్ఏకు పంపించినట్లు వెల్లడించారు.దాదాపు 50 ఏళ్లుగా కొనసాగుతున్న ఈ సమస్యపై కలెక్టర్ బాధితులతో



ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఇప్పటివరకు చేపట్టిన చర్యలను వివరించారు. రెవెన్యూ, మున్సిపల్, సర్వే రికార్డులను పరిశీలించి పరిష్కార మార్గాలను ప్రతిపాదించినట్లు తెలిపారు. బాధితులు ఎలాంటి అపోహలకు గురికావద్దని, ప్రభుత్వం, మంత్రులు సమస్య పరిష్కారానికి సానుకూలంగా ఉన్నారని భరోసా ఇచ్చారు.నివేదికపై సీసీఎల్ఏ పరిశీలన అనంతరం ప్రభుత్వ స్థాయిలో తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. న్యాయస్థానాల్లో ఉన్న కేసుల పరిష్కారంపైనా దృష్టి సారించినట్లు తెలిపారు. కలెక్టర్ చొరవపై బాధితులు సంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఖురాన్ షరీఫ్ పూర్తి చేసిన అబూబకర్ సిద్ధిఖ్‌కు ప్రత్యేక ప్రార్థన సమావేశం



కరీంనగర్, నవంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్): కరీంనగర్‌లోని మదర్సా ఇస్లామియాకు చెందిన విద్యార్థి అబూబకర్ సిద్ధిఖ్ ఖాన్‌పూర్ ఖురాన్ షరీఫ్‌ను పూర్తిచేసిన సందర్భంగా ప్రత్యేక ప్రార్థన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జమియత్ ఉలమా కరీంనగర్ అధ్యక్షులు హాజ్రత్ మౌలానా ముఫ్తీ యూనుస్ ఖాస్మీ సాహెబ్, మస్జిద్-ఎ-జమ్ జమ్ ముతవల్లీ జనాబ్ వహాజ్ సాహెబ్, మస్జిద్-ఎ-ముసల్లం ఇమామ్ వ ఖతీబ్ హాఫిజ్ ఫరీదుద్దీన్ అమ్జద్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థి అబూబకర్ సిద్ధిఖ్‌ను అభినందిస్తూ, అల్లాహ్ తఆలా పవిత్ర ఖురాన్ బోధనలను జీవితంలో ఆచరించే తౌఫీక్ ప్రసాదించాలని, మరింత ఉన్నతమైన ఇస్లామిక్ విద్యను అభ్యసించి సమాజానికి సేవలందించేలా దీవించాలని ప్రత్యేక దువా చేశారు.

జర్నలిస్టుల సేవలు అభినందనీయం



జేడీ మల్లంపల్లి, నవంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్): ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమాజాభివృద్ధికి విశిష్ట సేవలు అందిస్తున్నారని మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్ రావు అన్నారు. జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా జర్నలిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో మీడియా కృషి అభినందనీయమని కొనియాడారు. జర్నలిస్టుల సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆకాంక్షించారు.

విదేశీ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లి, నవంబర్ 16 (పీసీడబ్ల్యూన్యూస్):విదేశాల్లో ఉద్యోగాలు పొందేందుకు ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత ఈ నెల 20న నిర్వహించే రిజిస్ట్రేషన్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్ కోరారు. జర్మనీ, అమెరికా, జపాన్, దుబాయ్ సహా పలు దేశాల్లో నర్సింగ్, వైద్యం, నిర్మాణం, డ్రైవింగ్ తదితర రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు తెలిపారు.ఈ నెల 20న పెద్దపల్లి ఐడీఓసీలోని జిల్లా ఉపాధి కార్యాలయం, గది నంబర్ 233లో మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్ కార్డుతో హాజరై పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.మరిన్ని వివరాలకు 080 3552 4946, 8985336947, 8121262441 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.



పిల్లల సమస్యలపై ప్రత్యేక ప్రజావాణి



జేడీ మల్లంపల్లి, నవంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):మల్లంపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక పిల్లల ప్రజావాణి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల నుంచి నాలుగు దరఖాస్తులు స్వీకరించినట్లు ఎంపీడీవో రహీముద్దీన్ తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల సమస్యలను విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వినతులను పరిశీలించి, పరిష్కారానికి సంబంధిత అధికారుల ద్వారా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హామీ ఇచ్చారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని వైద్య పరీక్షలు అందుబాటులో ఉండాలి



పెద్దపల్లి, నవంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించేలా అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం రామగుండంలోని సింగరేణి వైద్య కళాశాలలో నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.ఆసుపత్రి అభివృద్ధి నిధులను పారదర్శకంగా వినియోగించాలని, నూతన ఆసుపత్రి భవన నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అవసరమైన వైద్య పరికరాల వివరాలు, అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు.అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించి, క్రిటికల్ కేర్ బ్లాక్ వరకు రహదారి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీ, రామగుండం మేయర్ మహంకాళి స్వామి, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ హిమబిందు సింగ్ తదితరులు పాల్గొన్నారు.

భగత్ నగర్‌లోని క్రీడా అకాడమీలను సందర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్





కరీంనగర్, నవంబర్ 16(పిసి డబ్ల్యూ న్యూస్): కరీంనగర్ జిల్లాలోని భగత్ నగర్‌లో ఉన్న స్వదేశ్ రైఫిల్ షూటింగ్ అకాడమీ, జీనియస్ చెస్ అకాడమీలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా అకాడమీల్లో శిక్షణ పొందుతున్న చిన్నారులతో ముచ్చటించి, వారితో కలిసి చెస్ ఆడటంతో పాటు రైఫిల్ షూటింగ్‌లో పాల్గొన్నారు. చిన్నారులను ప్రోత్సహిస్తూ క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు.

విద్యుత్ శాఖ ఏఈ బానోత్ రవిపై జిల్లా కలెక్టర్ వేటు!


- విద్యుత్ సరఫరా సమస్యలపై చర్యలు.. విధుల నుంచి తప్పించిన కలెక్టర్




ములుగు నవంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్): మంత్రి సీతక్క సూచనల మేరకు విద్యుత్ సరఫరా సమస్యలపై జిల్లా కలెక్టర్ బోర్డే హేమంత్ సహదేవరావు తీవ్రంగా స్పందించారు. ములుగు మండలంలోని ఎంటర్ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో విద్యుత్ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో విద్యుత్ శాఖ ఏఈ బానోత్ రవిపై చర్యలు తీసుకున్నట్లు సమాచారం.విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడటం, ప్రజల నుంచి ఫిర్యాదులు రావడం, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. విద్యుత్ సమస్యలపై ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.ముఖ్యంగా విద్యుత్ సరఫరా లోపాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించినట్లు సమాచారం. ఏఈ బానోత్ రవిపై తీసుకున్న చర్యలతో విద్యుత్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.

ధ్వజస్తంభం.. దేవాలయ ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీక!

- ఆలయాల్లో ధ్వజస్తంభం ఎందుకు ఏర్పాటు చేస్తారు? దాని విశిష్టత, సంప్రదాయాల వెనుక ఉన్న అంతరార్థం ఏమిటి?











తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 16, పి.సి.డబ్ల్యూ. న్యూస్ (తిరునహరి మనోహర స్వామి): భారతీయ దేవాలయ సంప్రదాయంలో ధ్వజస్తంభానికి ప్రత్యేక స్థానం ఉంది. ఆలయంలోకి ప్రవేశించగానే భక్తులకు కనిపించే ఎత్తైన ధ్వజస్తంభం కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదు.. ఆధ్యాత్మికతకు, భక్తికి, ఆలయ సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. అయితే ప్రతి దేవాలయంలోనూ ధ్వజస్తంభం ఉండదు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన కొన్ని ఆలయాల్లోనూ ఇది కనిపించదు. అసలు ధ్వజస్తంభాన్ని ఎందుకు ఏర్పాటు చేస్తారు? దాని ప్రాధాన్యత ఏమిటి? అనే విషయాలను ఒకసారి పరిశీలిద్దాం.**ధ్వజస్తంభం అంటే ఏమిటి?**సాధారణంగా ఆలయ గర్భగుడికి ఎదురుగా, బలిపీఠం సమీపంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తారు. దీనిని ధ్వజం లేదా ఆలయ పతాక స్తంభం అని కూడా పిలుస్తారు. ఆగమ శాస్త్ర సంప్రదాయాల ప్రకారం ఆలయ నిర్మాణంలో దీనికి విశిష్ట స్థానం ఉంది.ఆధ్యాత్మిక తత్వంలో మానవ శరీరాన్ని దేవాలయంతో పోలుస్తారు. శరీరంలోని వెన్నెముకను ధ్వజస్తంభానికి ప్రతీకగా భావిస్తారు. భక్తుడు తనలోని అహంకారాన్ని విడిచిపెట్టి, వినయంతో దైవాన్ని దర్శించుకోవాలనే సందేశాన్ని ఇది అందిస్తుంది.**ధ్వజస్తంభాన్ని ఎందుకు ఏర్పాటు చేస్తారు?** 1. ఆలయ ఉత్సవాలకు సంకేతం: ఆలయంలో బ్రహ్మోత్సవాలు, వార్షిక ఉత్సవాలు ప్రారంభమైనప్పుడు ధ్వజస్తంభంపై దేవతా వాహనం గుర్తుతో కూడిన పతాకాన్ని ఎగురవేస్తారు. దీనినే ధ్వజారోహణం అంటారు. ఉత్సవాలు ముగిసిన తర్వాత ధ్వజావరోహణం నిర్వహిస్తారు. ఇది ఆలయ ఉత్సవ సంప్రదాయంలో ముఖ్యమైన ఘట్టం. 2. దైవానికి ప్రతీక: ధ్వజస్తంభం ఆలయ పవిత్రతను, దైవ సాన్నిధ్యాన్ని సూచిస్తుంది. భక్తుడు గర్భగుడిలోకి వెళ్లే ముందు ధ్వజస్తంభానికి నమస్కరించడం అనేక ఆలయాల్లో సంప్రదాయంగా కొనసాగుతోంది. 3. ఆధ్యాత్మిక సందేశం: ఎత్తుగా నిలిచే ధ్వజస్తంభం మనిషి ఆలోచనలు ఉన్నతంగా ఉండాలని, అహంకారాన్ని విడిచిపెట్టి భక్తి మార్గంలో పయనించాలని సూచిస్తుందని ఆధ్యాత్మిక పెద్దలు వివరిస్తారు.**ధ్వజస్తంభాల నిర్మాణంలో ప్రత్యేకత**ఆగమ సంప్రదాయాల ప్రకారం ధ్వజస్తంభం నిర్మాణానికి కొన్ని నియమాలు ఉన్నాయి. ఆలయ స్వరూపం, పరిమాణం, ఆచారాలను అనుసరించి దాని ఎత్తు, నిర్మాణ పద్ధతిని నిర్ణయిస్తారు. సాధారణంగా కలపతో తయారు చేసిన ధ్వజస్తంభానికి రాగి, ఇత్తడి లేదా బంగారు పూతతో కూడిన కవచాలను అమర్చుతారు. కొన్ని ఆలయాల్లో రాతి ధ్వజస్తంభాలు కూడా కనిపిస్తాయి. ధ్వజస్తంభం పైభాగంలో గంటలు, దిశలను సూచించే నిర్మాణాలు, దేవతా వాహనానికి సంబంధించిన చిహ్నాలు ఉంటాయి.గాలి వీచినప్పుడు గంటల నుంచి వెలువడే శబ్దం ఆలయ వాతావరణానికి ఆధ్యాత్మిక శోభను అందిస్తుంది. పూజల సమయంలో గంటానాదం భక్తుల దృష్టిని దైవంపై కేంద్రీకరించేందుకు తోడ్పడుతుంది. **ధ్వజస్తంభం పిడుగుల నుంచి రక్షిస్తుందా?** పూర్వకాలంలో ఆలయాలు గ్రామాల్లో ఎత్తైన నిర్మాణాలుగా ఉండేవి. ధ్వజస్తంభాలపై లోహపు కవచాలు ఉండటంతో అవి పిడుగుల నుంచి రక్షణ కల్పిస్తాయని కొందరు భావిస్తారు. అయితే ధ్వజస్తంభం ఒక్కటే పిడుగుల నుంచి ఆలయాన్ని రక్షిస్తుందని చెప్పడానికి శాస్త్రీయ ఆధారాలు లేవు. పిడుగుల నుంచి భవనాలకు రక్షణ కల్పించాలంటే సరైన పిడుగుపాటు రక్షణ వ్యవస్థ, భూమికి అనుసంధానం అవసరం.**వందల సంవత్సరాల ఆలయాల్లో ధ్వజస్తంభాలు ఎందుకు లేవు?**ప్రతి దేవాలయంలోనూ ధ్వజస్తంభం ఉండాలనే నియమం లేదు. ఆలయ సంప్రదాయం, ఆగమ విధానం, నిర్మాణ శైలి, దేవతా ఆరాధనా పద్ధతులను బట్టి ధ్వజస్తంభం ఏర్పాటు ఆధారపడి ఉంటుంది. కొన్ని పురాతన ఆలయాల్లో ధ్వజస్తంభం లేకపోవడానికి వాటి నిర్మాణ కాలం నాటి ఆచారాలు, సంప్రదాయాలు కారణమై ఉండవచ్చు. మరికొన్ని చోట్ల కాలక్రమంలో ధ్వజస్తంభాలు ధ్వంసమై ఉండవచ్చు లేదా పునర్నిర్మాణం జరగకపోయి ఉండవచ్చు.అందువల్ల ధ్వజస్తంభం లేని ఆలయాన్ని సంప్రదాయ విరుద్ధమైనదిగా భావించకూడదు. ఆలయ ప్రాముఖ్యతను కేవలం ధ్వజస్తంభం ఉందా లేదా అనే అంశంతో నిర్ణయించలేం. **భక్తుడికి ధ్వజస్తంభం ఇచ్చే సందేశం**దేవాలయానికి వెళ్లినప్పుడు ధ్వజస్తంభం వద్ద నమస్కరించడం ద్వారా భక్తుడు తనలోని అహంకారాన్ని విడిచిపెట్టి దైవ దర్శనానికి సిద్ధమవుతాడని ఆధ్యాత్మిక భావన. ధ్వజస్తంభం మనిషికి వినయం, క్రమశిక్షణ, భక్తి, ఉన్నతమైన ఆలోచనల ప్రాధాన్యతను గుర్తుచేస్తుంది.**ముగింపు:** ధ్వజస్తంభం అనేది దేవాలయ నిర్మాణంలో ఒక భాగం మాత్రమే కాదు.. భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలు, ఆగమ శాస్త్రాలు, భక్తి భావనలకు ప్రతీక. ఒక్కో ఆలయానికి ఒక్కో ప్రత్యేకత ఉన్నట్లే, ధ్వజస్తంభం ఉన్న ఆలయాలకు దాని వెనుక ప్రత్యేకమైన ఆచార, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉంటుంది. తరతరాలుగా కొనసాగుతున్న ఈ సంప్రదాయాలను తెలుసుకోవడం మన సంస్కృతి వైభవాన్ని అర్థం చేసుకోవడానికి దోహదపడుతుంది.

అక్రమంగా పేలుడు పదార్థాల తరలింపు.. ఒకరి అరెస్ట్

● జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, కారు స్వాధీనం

పరకాల, నవంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్):

అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలను తరలిస్తున్న వ్యక్తిని పరకాల పోలీసులు అరెస్ట్ చేశారు. ముస్త్యాలపల్లి గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా స్విఫ్ట్ డిజైర్ కారులో తరలిస్తున్న 200 జిలెటిన్ స్టిక్స్, 375 మీటర్ల సేఫ్టీ ఫ్యూజ్ వైర్, రెండు డిటోనేటర్లను స్వాధీనం చేసుకున్నారు. కారుతో పాటు మొబైల్ ఫోన్‌ను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కొత్తపల్లికి చెందిన సంపంగి శ్రీనివాస్ (45)గా గుర్తించారు. హుజూరాబాద్‌కు చెందిన జున్నోజు రాజేందర్ వద్ద పేలుడు పదార్థాలు కొనుగోలు చేసి, నడికూడకు చెందిన శివరాత్రి ఎల్లయ్యకు విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ ఘటనపై పరకాల ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అత్యాధునిక చికిత్సతో 80 ఏళ్ల వృద్ధుడికి పునర్జన్మ

- క్లిష్టమైన గుండె రక్తనాళాల చికిత్స విజయవంతం

- ప్రాణాపాయ స్థితి నుంచి సాధారణ జీవితంలోకి 80 ఏళ్ల వృద్ధుడు

- యశోద హాస్పిటల్స్ అసోసియేట్ కన్సల్టెంట్, ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ ప్రముఖ వైద్యులు డాక్టర్ శ్రీహర్ష జి.ఆర్



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్): తీవ్రమైన గుండె రక్తనాళాల అడ్డంకులతో ప్రాణాపాయ స్థితికి చేరుకున్న 80 ఏళ్ల వృద్ధుడికి హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆసుపత్రి వైద్యులు అత్యాధునిక చికిత్స అందించి ప్రాణాలు కాపాడారు. ప్రస్తుతం ఆయన కోలుకుని సాధారణ జీవితం గడుపుతున్నారని ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీహర్ష జి.ఆర్ తెలిపారు.ఖమ్మంకు చెందిన వృద్ధుడి గుండెలోని మూడు ప్రధాన రక్తనాళాల్లో తీవ్ర అడ్డంకులు ఉన్నట్లు గతంలో వైద్యులు గుర్తించారు. చికిత్స సమయంలో రక్తనాళానికి గాయం కావడంతో పరిస్థితి విషమించింది. దీంతో కుటుంబ సభ్యులు యశోద ఆసుపత్రిని ఆశ్రయించారు. వైద్యులు ముందుగా రక్తనాళానికి అయిన గాయానికి చికిత్స అందించి, అనంతరం రోటాబ్లేషన్, ఇంట్రావాస్కులర్ అల్ట్రాసౌండ్, షాక్‌వేవ్ వంటి ఆధునిక సాంకేతిక విధానాలతో అడ్డంకులను తొలగించారు.చికిత్స విజయవంతం కావడంతో గుండెకు రక్తప్రసరణ సాధారణ స్థితికి చేరుకుంది. వృద్ధుడి ఆరోగ్యం నిలకడగా ఉండటంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు డాక్టర్ శ్రీహర్ష తెలిపారు. ఖమ్మంలోని యశోద మెడికల్ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వైద్యులు డాక్టర్ అశోక్ తివారీ తదితరులు పాల్గొన్నారు.

బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బహుమతులు

- లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



కరీంనగర్, నవంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్): లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో కుమార్‌వాడి ప్రభుత్వ పాఠశాలలో సోమవారం బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. స్వపరిపాలన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు.విద్యార్థులకు బిస్కెట్లు, ఉపాధ్యాయులకు వస్త్ర సంచులు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మ్యాడం శివకాంత్ పటేల్, కార్పొరేటర్ ఆకుల ఉదయ్, కోల అన్నారెడ్డి, ఐత సూరజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడీవిధానాలపై సమరశీల పోరాటం



డిశంబర్ లో జైల్ భర్

ఇంటింటా మహిళా సమాఖ్య మహాసభల ప్రచారం

కాంగ్రెస్తో సన్నగిల్లుతున్న విశ్వనీయత

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) : దేశాన్ని తిరోగమనం వైపు నడిపిస్తున్నమోడీ విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సి.పి.ఐ జాతీయ సమితిసభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. ఆర్థిక, సామాజిక, పారిశ్రామిక, విద్యా, వైద్యరంగాలలో ప్రగతి కుంటుపడిందని ఆయన ఆరోపించారు. సి.పి.ఐ జిల్లా కార్యవర్గసమావేశం సోమవారం స్థానిక గిరిప్రసాద్భవన్లో రావి శివరామకృష్ణ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ.. మోడీ సంపన్నులు, కార్పొరేట్ల కోసమే పాలన సాగిస్తున్నారని మొత్తం దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర జరుగుతుందన్నారు. ఇప్పటికే రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు నవ రత్నాలు లాంటి కంపెనీలను కార్పొరేట్లకు కట్టబట్టిన మోడీ ఇప్పుడు బ్యాంకింగ్ వ్యవస్థను విధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. ఐడిబిఎ బ్యాంక్ వ్యవహారం మోడీ పాలన కుట్రలో భాగమేనని హేమంతరావు తెలిపారు. ఈదేశంలో 50 శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని సైతం పెట్టుబడీదారులకు కట్టపెట్టే ప్రయత్నం జరుగుతుందని అందులో భాగంగానే వ్యవసాయరంగాన్ని సంక్షోభం వైపు నడిపే నల్లచట్టాలను తీసుక రావడంతోపాటు అమెరికాతో వాణిజ్య ఒప్పందాలను చేసుకుంటున్నారని హేమంతరావు తెలిపారు. అమెరికాతో ఒప్పందాలు భారత దేశ వ్యవసాయ రంగాన్ని కుదేలు చేయనున్నాయన్నారు. ఇటువంటి పరిస్థితులలో మోడీ విధానాలను అడ్డుకునేందుకు అడుగడుగునా కమ్యూనిస్టుపార్టీ ప్రయత్నిస్తుందన్నారు. మోడీ విధానాలను నిరసిస్తూ డిశంబర్ 1,2,3 తేదీలలో జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. జైల్ భరో కార్యక్రమాన్ని ఖమ్మం జిల్లాలో జయప్రదం చేసేందుకు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య 3వ మహాసభలను డిశంబర్ 27,28,29 తేదీలలో ఖమ్మంలో జరుగనున్నాయని ఈ సందర్భంగా 27వ తేదీన ఖమ్మంలో వేలాది మంది మహిళలతో బహిరంగసభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. దేశంలో మహిళలెదుర్కొంటున్న సమస్యలను ప్రజలకు వివరిస్తూ మహిళసమాఖ్య మహాసభల ప్రచారాన్ని ఇంటింటికి చేర్చాలని ఆయన కోరారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చి వాగ్దానాలను అమలు చేయక పోవడం అసంపూర్తిపథకాలు, అమలుకాని వాగ్దానాలతో ప్రజల్లో ప్రభుత్వం పట్ల విశ్వనీయత సన్నగిల్లుతుందని హేమంతరావు తెలిపారు. అనేక పథకాలు అసంపూర్తిగా అమలు అవుతున్నాయని, కాంగ్రెస్ ప్రకటించిన కొన్ని పథకాలు ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదని హేమంతరావు తెలిపారు. ఇప్పటికే మూడేళ్ళు గడచిపోతున్నాయని, కాని విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాలలో పురుగతి కనిపించడం లేదనివ ఎలినినో నేపధ్యంలో కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా కార్యాచరణ చేపట్టాలన్నారు. రైతాంగాన్ని ఆదుకోవడంతోపాటు గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ కార్మికులను ఆదుకునేందుకు ప్రత్యేక నిధులు కేటాయించలన్నారు. వి.వి.జి. రామ్ జీ పథకంతోపాటు కరువు పనులు చేపట్టాలని హేమంతరావు డిమాండ్ చేశారు. రుణాల వడ్డీలు మాఫీచేసి కొత్తరుణాలివ్వాలన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టిసారించాలని, గ్రామశాఖబలోపేతమే లక్ష్యంగా పనిచేయలన్నారు. సి.పి.ఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కార్యకలపాల నివేధికను ప్రవేశపెట్టగా, రాష్ట్ర కంట్రోల్ కమీషన్ ఛైర్మెన్, మహ్మద్ మౌలానా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి పాల్గొన్నారు.

నేడు తొర్రూరులో నూతన చేయూత పింఛన్ల పంపిణీ

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి చేతుల మీదుగా అందజేత



తొర్రూరు ప్రతినిధి, నవంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం మంజూరు చేసిన నూతన చేయూత పింఛన్లను మంగళవారం ఉదయం 8:30 గంటలకు తొర్రూరులోని రామ ఉపేందర్ గార్డెన్స్‌లో ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పంపిణీ చేయనున్నారు. లబ్ధిదారులు, సర్పంచులు తమ గ్రామాల పింఛనుదారులతో కలిసి ఉదయం 8 గంటలలోపు కార్యక్రమానికి చేరుకోవాలని నిర్వాహకులు కోరారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్యాలను సాధించాలి

కల్లూరు, నవంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సత్తుపల్లి రూరల్ సీఐ పి. సర్వయ్య సూచించారు. కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని జీడీబీ పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంఘం శంభయ్య, తిరుపతమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. చెడు అలవాట్లు



భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయని హెచ్చరించారు.మోటివేషనల్ ట్రైనర్ జవ్వాది వెంకటేశ్వర బాబు మాట్లాడుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి, క్రమశిక్షణతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. నిర్వాహకులు సంఘం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వేముల శేఖర్, కల్లూరు ఎస్ఐ జె. నాగరాజు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి:జిల్లా కలెక్టర్



ములుగు జిల్లా, నవంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతగా పరిశీలించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మొత్తం 22 దరఖాస్తులు అందాయి. వీటిలో భూ సమస్యలకు సంబంధించి 7, ఇందిరమ్మ ఇళ్లకు 2, పింఛన్లకు 4, ఇతర శాఖలకు సంబంధించి 9 దరఖాస్తులు ఉన్నాయి. సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని, పరిష్కార స్థితిని అర్జీదారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రాధాన్యం: మంత్రి తుమ్మల

సత్తుపల్లి, నవంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):రైతుల సంక్షేమం, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సత్తుపల్లి వ్యవసాయ మార్కెట్‌లో రూ.10.80 కోట్ల అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం చల్లగుల్ల నరసింహారావు అధ్యక్షతన నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని మరిన్ని ప్రాంతాలకు గోదావరి జలాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కల్లూరుగూడెంలో ఆయిల్‌ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణంతో పామాయిల్ సాగుకు ప్రోత్సాహం లభిస్తుందని, కోకో, మిరియాలు వంటి ఉద్యాన పంటల సాగుతో రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఖమ్మం మార్కెట్ తరహాలో సత్తుపల్లి మార్కెట్‌ను కూడా ఆదర్శ మార్కెట్‌గా







తీర్చిదిద్దుతామని తెలిపారు.ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ నూతన మార్కెట్ కమిటీ రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ మార్కెట్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలో కొత్త పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు వివరించారు.కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెహానా బేగం, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

పిల్లల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజావాణి

•ప్రజావాణి నిర్వహణ, సమస్యల పరిష్కార విధానాన్ని విద్యార్థులకు వివరించిన జిల్లా కలెక్టర్ •జిల్లావ్యాప్తంగా పిల్లల ప్రజావాణికి 32 దరఖాస్తులు



ములుగు జిల్లా, నవంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):బాలల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం, అభిప్రాయాలకు ప్రాధాన్యత కల్పించేందుకు ములుగు జిల్లాలో ప్రత్యేక పిల్లల ప్రజావాణి నిర్వహించారు. బాలల దినోత్సవం, బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా 'నా రోజు.. నా హక్కులు.. నా భవిష్యత్' నినాదంతో సోమవారం కలెక్టరేట్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు విద్యార్థుల నుంచి వినతులు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజావాణి నిర్వహణ, దరఖాస్తుల స్వీకరణ, సమస్యల పరిష్కార విధానాన్ని విద్యార్థులకు వివరించారు. పాఠశాలల్లో, నివాస ప్రాంతాల్లో ఎదురవుతున్న సమస్యలను నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థులు సమర్పించిన వినతులను పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.జిల్లావ్యాప్తంగా నిర్వహించిన పిల్లల ప్రజావాణిలో మొత్తం 32 దరఖాస్తులు అందాయి. వీటిలో మండల స్థాయిలో 22, జిల్లా కలెక్టరేట్‌లో 10 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, ఎం. సంపత్ రావు, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రేమలత, డీఎస్పీ కిషోర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

భగత్ నగర్ 41వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కరీంనగర్ నవంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్):

కరీంనగర్: నగరంలోని భగత్ నగర్ 41వ డివిజన్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ నాంపల్లి రేణుక శ్రీనివాస్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



వినియోగదారుల హక్కుల పరిరక్షణపై చర్చ



పెద్దపల్లి, నవంబర్ 16 (పీసీడబ్ల్యూన్యూస్): ఢిల్లీలోని ఆల్ ఇండియా వినియోగదారుల ఫోరం కార్యాలయంలో నిర్వహించిన జాతీయస్థాయి సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి కట్కూరి సందీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫోరం ప్రతినిధి సుభాష్ బిహారీని మర్యాదపూర్వకంగా కలిశారు.సమావేశంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడం, వినియోగదారులకు న్యాయం అందించే అంశాలపై చర్చించారు. వినియోగదారుల హక్కులపై అవగాహన పెంపొందిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కట్కూరి సందీప్ తెలిపారు.

కమలాపూర్ ఎం.జె.పి.బాయ్స్ ప్రిన్సిపల్ పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

- ప్రిన్సిపాల్‌పై సమగ్ర విచారణ జరగాలి: మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దూడ శ్రీకాంత్ డిమాండ్

కమలాపూర్ నవంబర్ 16(పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని ఎం.జె.పి. బాయ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ తాడూరి రవీందర్ అక్రమాలపై కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తున్నట్లు కమలాపూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు దూడశ్రీకాంత్ తెలిపారు.ఈ సందర్భంగా యూత్ అధ్యక్షులు శ్రీకాంత్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎం జె పి బాయ్స్ ప్రిన్సిపల్ రవీందర్ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ అవినీతి,అక్రమాలు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని యువజన కాంగ్రెస్ కమలాపూర్ మండల అధ్యక్షులు దూడ శ్రీకాంత్ డిమాండ్ చేశారు. పాఠశాలలో సమ్మర్ క్యాంప్ నిధుల దుర్వినియోగం,నకిలీ బిల్లుల సృష్టి,ఉపాధ్యాయులకు సంబంధించిన జీతాల చెక్కులకు డబ్బులు వసూలు చేయడం, మెస్ నిర్వహణలో అక్రమాలు, కాంట్రాక్టు ల కేటాయింపులో అవకతవకలకు పాల్పడుతున్నారని తెలిపారు.పాఠశాలఅడ్మిషన్ల పేరుతో ఒక్కో సీటు కు 30వేల నుండి 45 వేల వరకు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపించారు.పీఎం శ్రీ పథకం నిధుల పక్కదారి పట్టాయని,విద్యార్థుల కోసం గీజర్ల



ఏర్పాటు పేరుతో వసూలు చేసిన డబ్బులు దుర్వినియోగం అయ్యాయని అన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించిన ఫిర్యాదులపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు.టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాలో అర్హత లేని సిబ్బందికి ఓటు హక్కు కల్పించారనే ఆరోపించారు.దీనికి సంబంధించిన రికార్డులను పరిశీలించాలని డిమాండ్ చేశారు.ప్రిన్సిపాల్ గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి నేటి వరకు ఆర్థిక,పరిపాలనా వ్యవహారాలపై ప్రత్యేక



ఆడిట్ నిర్వహించాలని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ప్రిన్సిపాల్ రవీందర్ పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను కోరినట్లు దూడ శ్రీకాంత్ తెలిపారు.నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పిస్తున్న ప్రభుత్వం, నిర్లక్ష్యం వహిస్తున్న అధికారుల పై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొండ తిరుపతి గౌడ్,కిషన్ సెల్ మండల అధ్యక్షుడు రిక్కల నారాయణ రెడ్డి,నకీర్త రాం చందర్ తదితరులు పాల్గొన్నారు.

మాధకద్రవ్యాల నిర్మూలన నేటి తరం విద్యార్థుల చేతుల్లోనే ఉంది

- సిఐ సత్తుపల్లి రూరల్ పంజాల సర్వయ్య



కల్లూరు, నవంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) :మాధకద్రవ్యాల నిర్మూలన నేటి తరం విద్యార్థుల చేతుల్లోనే ఉందని సత్తుపల్లి రూరల్ సిఐ సర్వయ్య అన్నారు. సోమవారం కల్లూరు ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సత్తుపల్లి రూరల్ సిఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నివారణ సమాజంలో అందరి బాధ్యతని, యువత మాదకద్రవ్యాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకోవొద్దని అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వాములు కావాలి సూచించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల రవాణా అధికంగా జరుగుతుందన్న నేపథ్యంలో పోలీసు యంత్రాంగం దృష్టిసారించిందన్నారు. పెడదారి పడుతున్న యువత కు కళాశాలల్లో కౌన్సిలింగ్ కల్పించాలని, తల్లిదండ్రులు సైతం పిల్లల ప్రవర్తన పై దృష్టి సాధించాలని సూచించారు.

ప్రజావాణిలో 15 దరఖాస్తులు

● క్వారీపై సమగ్ర విచారణ జరిపించాలని గుండేడు గ్రామ ప్రజలు విజ్ఞప్తి



కమలాపూర్ నవంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 15 దరఖాస్తులు వచ్చాయని కమలాపూర్ మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి గుండె బాబు తెలిపారు. అత్యధికంగా 6 దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నట్లు ఎంపీడీవో తెలిపారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు అన్ని శాఖలు సమన్వయంతో సత్వరమే పరిష్కరిస్తున్నట్లు ఎంపీడీవో గుండె బాబు తెలిపారు.మండలంలోని గుండేడు గ్రామ ప్రజలు గ్రానైట్ క్వారీ పై ప్రజావాణిలో దరఖాస్తు చేశారు. క్వారీ పై సమగ్ర దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేశారు.గుండేడు,వంగపల్లి,పంగిడిపల్లి మూడు గ్రామాలకు వాతావరణ కాలుష్యం ఏర్పడి పంటలకు నష్టం కలుగుతుందని,ప్రజలకు ఇబ్బందికరంగా ఉందని క్వారీ యజమానులు నిబంధనలకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసి మూడు గ్రామాలకు ఇబ్బంది కలిగిస్తున్నారని గ్రామ ప్రజలు కోరారు.ఎంపీడీవో గుండె బాబు మాట్లాడుతూ తక్షణమే విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చారు.

పిల్లల ఎదుగుదలకు తల్లిదండ్రులు సహకరించాలి

పిల్లల పట్ల అశ్రద్ధ చూపకండి:దేవపూర్ గ్రామం సర్పంచ్ సిడం రామదాస్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 16 (పీసీడబ్ల్యూ న్యూస్):పిల్లల పట్ల తల్లిదండ్రులు అశ్రద్ధ చూపకుండా వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సహకరించాలని దేవాపూర్ సర్పంచ్ సిడం రాందాస్ సూచించారు. కాసిపేట మండలం దేవాపూర్ పరిధిలోని మేదర బస్తీ 8వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం అందించారు. పిల్లల ఆరోగ్యం, విద్యపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజశేఖర్, మహేష్, శ్రవణ్, భరత్, అంగన్‌వాడీ టీచర్ స్వరూప రాణి, తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసిన కమలాపూర్ మండల బిజెపి నాయకులు



కమలాపూర్ నవంబర్16(పిసిడబ్ల్యూ న్యూస్): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల బిజెపి మండల అధ్యక్షులు ర్యాకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కమలాపూర్ మండల బిజెపి నాయకులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. కమలాపూర్ మండల అభివృద్ధికి,భీంపల్లి గ్రామాభివృద్ధికి, ఉప్పల్ రైల్వే స్టేషన్ ఆదునీకరణకు నిధులు మంజూరు చేయాలని మంత్రి బండి సంజయ్ కి మండల నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కమలాపూర్ మండల అభివృద్ధికి తప్పకుండా నిధులు మంజూరు చేసి మండలాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ బిజెపి మండల ప్రధాన కార్యదర్శి భూపతి ప్రవీణ్,భీంపల్లి ఉపసర్పంచ్ మునిగే రాజు, 9వ వార్డు సభ్యులు అకినపల్లి రవీందర్,3 వ వార్డు సభ్యులు బండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యూ లక్ష్మీపురం కేజీబీవీ క్రీడాకారులకు ఘన సన్మానం



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) : ముదిగొండ మండలం, న్యూలక్ష్మీపురం గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులు క్రీడల్లో బాగా రాణించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించడం అభినందనీయమని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ అన్నారు. ముదిగొండ మండల కేంద్రంలోని నవతేజ ఫంక్షన్ హాల్ లో సోమవారం యుటిఎఫ్ ఏడవ జిల్లా మహాసభలు ఘనంగా జరిగాయి. ఈ మహాసభలకు హాజరైన యుటిఎఫ్ నాయకులు ముదిగొండ మండలం నుండి క్రీడలలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి కేజీబీవీ పాఠశాలకు, ఖమ్మం జిల్లాకు మంచి పేరు సాధించారని, న్యూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన కేజీబీవీ విద్యార్థినులను, ఆటల్లో బాలికలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న ఆ పాఠశాల పిఈటి సునీతను యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు అభినందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో న్యూలక్ష్మీపురం కేజీబీవీ క్రీడాకారులు సునీత, క్రితిక, కీర్తి, లాస్య, నందిని, స్వేత, పీఈటి సునీత, ఉపాధ్యాయురాలు కవిత, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరావు, జిల్లా కార్యదర్శి పి. సురేష్ ముదిగొండ మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి రాంబాబు, సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల ఆశలకు ఉద్యోగాల భరోసా గ్రంథాలయం

● యువత భవితకు బాటలు వేస్తున్న జిల్లా గ్రంథాలయం ● పోటీ పరీక్షల అభ్యర్థుల్లో నూతనోత్సాహం ● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా









ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) : చదువుకోవాలనే తపన ఉంది.. ప్రతిభకు కొదవలేదు.. జీవితంలో స్థిరపడాలనే ఆశయమూ ఉంది.. కానీ సరైన మార్గదర్శకత్వం లేక ఎంతోమంది నిరుద్యోగ యువత లక్ష్య సాధనలో వెనుకబడుతున్నారు. అలాంటి యువతకు అండగా నిలుస్తూ, వారి ఆశలకు కొత్త రెక్కలు తొడుగుతూ ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయం ఉద్యోగ సాధనకు దిక్సూచిగా మారుతోంది. పుస్తకాలకే పరిమితం కాకుండా నిరుద్యోగుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ, ఉద్యోగాల ఆశలకు భరోసానిచ్చే విజ్ఞాన కేంద్రంగా తన బాధ్యతను చాటుకుంటోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా అన్నారు.59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా సోమవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా ప్రత్యేక చొరవతో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు ప్రత్యేక మోటివేషన్ తరగతులను నిర్వహించారు. సుమారు 400 మంది యువత పాల్గొన్న ఈ కార్యక్రమం వారిలో నూతన ఉత్సాహాన్ని, ఉద్యోగ సాధనపై ఆత్మవిశ్వాసాన్ని నింపింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సైకాలజీ లెక్చరర్, కాంపిటేటివ్ ఎగ్జామ్స్ నిపుణులు తాళ్లూరి సృజన్ కుమార్ హాజరై గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, డీఎస్సీ, ఎస్సై, కానిస్టేబుల్ తదితర ప్రభుత్వ ఉద్యోగ పోటీ పరీక్షలకు సంబంధించిన సిలబస్, పరీక్షా విధానం, ప్రిపరేషన్, ప్రాక్టీస్, ప్రజెంటేషన్, సమయ నిర్వహణ తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం, ప్రణాళికాబద్ధంగా చదవడం, నిరంతర సాధన చేయడం ద్వారా విజయం సాధించవచ్చని వివరించారు. అపజయాలకు కుంగిపోకుండా ప్రతి ప్రయత్నాన్ని అనుభవంగా మలుచుకోవాలని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు.ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కూరపాటి ప్రదీప్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు చదువుతోపాటు ఆరోగ్యానికి కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. తగినంత నిద్ర, పౌష్టికాహారం, వ్యాయామం, మానసిక ప్రశాంతత విజయ సాధనలో కీలకమని వివరించారు. పరీక్షల ఒత్తిడిని అధిగమిస్తూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా మాట్లాడుతూ... నిరుద్యోగ యువతకు సరైన మార్గదర్శకత్వం అందించి, వారి ఉద్యోగ సాధనకు చేయూతనివ్వాలనే సంకల్పంతో ఇటువంటి వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఎంతోమంది యువత ప్రభుత్వ ఉద్యోగమే జీవితంలో స్థిరపడేందుకు ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్నారని, వారి ఆశయాలకు గ్రంథాలయం అండగా నిలవాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు.యువతకు అవసరమైన పఠన వాతావరణం, పుస్తకాలు, గ్రంథాలయ సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. నిరుద్యోగ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటూ పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధనతో తమ లక్ష్యాలను చేరుకోవాలని పిలుపునిచ్చారు. కేవలం పుస్తకాలను అందించే కేంద్రంగానే కాకుండా, యువత జీవితాల్లో వెలుగులు నింపే విజ్ఞాన వేదికగా గ్రంథాలయాలను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. పద్మజ, గ్రేడ్-1 లైబ్రేరియన్ సిహెచ్. మాల్సూర్, గ్రేడ్-3 లైబ్రేరియన్లు బాబు, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ పి. సంతోష్, జె. భాస్కర్ రావు, కార్యాలయ సిబ్బంది, సుమారు 400 మంది నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

సామాజిక ఐక్యతకు సేవాభావమే పునాది

- ఆర్జేసీ కృష్ణకు మున్నూరు కాపు జేఏసీ ఘన సత్కారం
- వన భోజనాల విజయానికి విశేష కృషి.. సేవలను గుర్తించి సన్మానం
- విద్యా, ఆర్థిక అభ్యున్నతికి నిరంతరం అండగా ఉంటా.. గుండాల కృష్ణ



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్) : సామాజిక ఐక్యతకు సేవాభావం తోడైతే సమాజ అభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని నిరూపించిన వ్యక్తిత్వానికి మున్నూరు కాపు జేఏసీ నాయకులు ఘనంగా గౌరవాభిమానాలు చాటుకున్నారు. ఖమ్మంలోని కాళ్ల రామారావు మామిడి తోటలో వేలాది మంది మున్నూరు కాపు సామాజిక వర్గీయుల సమక్షంలో అత్యంత వైభవంగా నిర్వహించిన వన భోజనాల కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో విశేష కృషి చేసిన ఎస్బీఐటీ, ఆర్జేసీ విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ (ఆర్జేసీ కృష్ణ)ను సోమవారం మున్నూరు కాపు జేఏసీ నాయకులు ఘనంగా సన్మానించారు. వేలాది కుటుంబాలు ఒకే వేదికపై కలుసుకుని ఆత్మీయతను పంచుకున్న ఈ వన భోజనాల వేడుక కేవలం విందు వినోదాలకే పరిమితం కాకుండా, సామాజిక బంధాలను బలోపేతం చేసే ఆత్మీయ సమ్మేళనంగా నిలిచింది. ఇంతటి భారీ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన గుండాల కృష్ణ సేవలను గుర్తించిన జేఏసీ నాయకులు ఆయనను సత్కరించి తమ కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా గుండాల కృష్ణ మాట్లాడుతూ.. వ్యక్తులుగా ఎంత ఎదిగినా, సమాజంతో మనకున్న అనుబంధాన్ని మరచిపోకూడదని, అందరం ఐక్యంగా ఉంటూ మన సామాజిక వర్గ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇలాంటి వన భోజనాల కార్యక్రమాలు కుటుంబాల మధ్య ఆత్మీయతను పెంపొందించడంతో పాటు, తరతరాల మధ్య అనుబంధాలను బలోపేతం చేస్తాయని, మనమంతా ఒకటేననే ఐక్యతా భావాన్ని చాటిచెబుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఇంతటి వైభవంగా విజయవంతం చేయడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనపై అభిమానంతో సన్మానించిన మున్నూరు కాపు జేఏసీ నాయకుల ఆదరాభిమానాలు తనకు మరింత బాధ్యతను గుర్తుచేశాయని భావోద్వేగంగా పేర్కొన్నారు. సమాజం తనకు ఇచ్చిన గౌరవాన్ని సమాజానికి తిరిగి సేవారూపంలో అందించడమే తన ఆకాంక్ష అని, ముఖ్యంగా సామాజిక వర్గంలోని విద్యార్థుల విద్యాభివృద్ధికి, నిరుపేద కుటుంబాల ఆర్థిక అభ్యున్నతికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని స్పష్టం చేశారు.ఈ సన్మానంలో మున్నూరు కాపు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మడూరి సైదారావు, జిల్లా అధ్యక్షులు యర్రా అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజా, జిల్లా యువజన అధ్యక్షులు మాటేటి రవి, ఐఎన్టీయూసీ నగర అధ్యక్షులు నరాల నరేష్, మోహన్ నాయుడు, నగర ఉపాధ్యక్షులు కొత్త రాజారామ్, నగర కార్యదర్శి వీసరి అంజయ్య తదితర ముఖ్య నాయకులు, పెద్ద సంఖ్యలో సామాజిక వర్గీయులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సంఘం మానవీయతకు ప్రతీక

దశదినకర్మలో పాల్గొని కుటుంబానికి సంఘీభావం
గుడిపూడి అప్పారావు సేవలకు ఘన నివాళి
కష్టసుఖాల్లో అండగా నిలవడమే సంఘం బాధ్యత : తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్



ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 16 (పిసిడబ్ల్యూ న్యూస్): గ్రామీణ వైద్యుల సంఘం సభ్యుల కష్టసుఖాల్లో అండగా నిలవడమే తమ బాధ్యతని తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్ అన్నారు.తల్లాడ మండలం జల్లుపాడు (జగన్నాధపురం) గ్రామానికి చెందిన సీనియర్ గ్రామీణ వైద్యులు గుడిపూడి అప్పారావు దశదినకర్మ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అప్పారావు గ్రామీణ వైద్య రంగానికి అందించిన సేవలను స్మరించుకుంటూ, ఆయన మృతి సంఘానికి తీరని లోటని పేర్కొన్నారు. సభ్యుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఐక్యంగా కృషి చేస్తామని దాసరి నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మర్రి నరేష్, ఉపాధ్యక్షులు చాపలమడుగు నాగేశ్వరరావు, గుర్రం సురేష్, సాగరపు ప్రసాద్, సరిగద్దే శ్రీనివాసరావు, బానోతు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.